క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



గోపయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొండమీది గోవిందరావు తండ్రి తెలంగాణ సాయుధ పోరాటయోధులు కొండమీది పెదగోపయ్య, బీఆర్ఎస్ నాయకులు గండు శ్రీనివాస్ మామ అనంతుల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు అనంతుల శ్రీనివాస్‌గౌడ్, మామిడి అంజయ్య, వెంకటేశ్వర్లుగౌడ్, సర్పంచ్‌లు ఉన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్‌స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన సీహెచ్.సౌమ్యాబాయి, బాకి శ్రీవల్లి, ధరావత్ భానుప్రియ, కోటమర్తి యాకస్వామి ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున 9వ తరగతి నుంచి 12వతరగతి వరకు ఉపకార వేతనాలు అందనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో గల గంగా పార్వతీ సహిత శివసాయి స్వామి వారికి శుక్రవారం అమావాస్య సందర్భంగా రుద్రాభిషేకం, పంచామృత అభిషేక పూజలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు వలివేటి విశ్వేశ్వరశర్మ, మామిళ్లపల్లి గంగాధర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ సభ్యులు మార్గం ప్రేమలత ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే అనాథాశ్రమానికి వాటర్‌ట్యాంక్, పైపులు, నల్లాలు, సింకును బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జలగం రామచంద్రన్, కార్యదర్శి ఐత శ్రీనివాస్, ట్రెజరర్ సురేష్‌కుమార్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, కందుకూరి సూర్యం, గణేష్, గిరి, సుందర్, పద్మారెడ్డి, నగరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ కార్యాలయం ఎదుట ముదిరాజుల ధర్నా



ధర్నా చేస్తున్న ముదిరాజు కులస్తులు

భానుపురి (సూర్యాపేట) : తీర్మానం లేకుండా మత్స్యసొసైటీలో కొత్త సభ్యులను చేర్చారని ఆరోపిస్తూ మండలంలోని టేకుమట్ల మత్స్య శాఖ సొసైటీ సభ్యులు శుక్రవారం మత్స్య శాఖ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి విచారణ చేయకుండా అధికారులు కొంతమందితో కుమ్మక్కై కొత్త సభ్యులను చేర్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన తీవ్రతరం కావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళలను బయటకు పంపించారు. అనంతరం మత్స్య శాఖ అధికారి రూపేందర్‌సింగ్ అభ్యంతరాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. తమకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నక్క నగేష్, జానకిరాములు, అంజయ్య, దాసరి శ్రీను, వెంకన్న, మహిళలు ఉన్నారు.

పంట కాల్వలకు మరమ్మతులు

- ఉపాధిహామీ పథకంలో చెరువు, లిఫ్టుకాల్వల్లో పూడికతీత పనులు
- ఉపాధి పొందుతున్న కూలీలు
- రైతులకు చేకూరనున్న ప్రయోజనం



అనంతారంలో లింకు కాల్వల్లో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

పెన్‌పహాడ్ : ఎంతోకాలంగా మరమ్మతులు లేక పిచ్చిమొక్కలతో, పూడికతో నిండిఉన్న పంటకాల్వలకు, రోడ్డు సైడ్ కాల్వలకు ఉపాధిహామీ పథకం పనులతో మహర్దశ పట్టింది. ఈ మరమ్మతు పనులతో కాలువలు విశాలంగా కనిపిస్తున్నాయి. ఇంతకు ముందు ఉపాధి పనులు మొత్తం చెరువుల్లో కుంటల్లో పూడికతీత పనులు చేసేవాళ్లు, ఈ సంవత్సరం ఉపాధి హామీ పథకంలో భాగంగా కెనాల్, లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. మండలంలో ఈనెల మొదటి వారం నుంచి మొదలైన ఉపాధి పనులు ఎక్కువగా రైతులకు ప్రయోజనం చేకూరేవిగా చేపడుతున్నారు. ఈ క్రమంలోనే కెనాల్, లిఫ్ట్ ఆయకట్టుకు అనుబంధంగా ఉన్న వనరుల నుంచి కెనాల్‌కు వచ్చి, అక్కడి నుంచి లింక్ కాల్వలకు నీరు అందుతుంది. ఈ క్రమంలో నీరు సాఫీగా ప్రవహించకుండా ఉండటంతో దిగువన ఉన్న రైతులకు సక్రమంగా నీరు అందడం లేదు. ప్రస్తుతం ఉపాధిహామీ పనులతో కాల్వల ద్వారా ఆయకట్టుకు నీరు సక్రమంగా అందనుంది.

కాల్వల మరమ్మతులతో రైతుల హర్షం..

ఈ నెలలో ప్రారంభమైన పనులన్నీ దాదాపు కెనాల్, లిఫ్టులకు ఊతమిచ్చేలా సాగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దోసపహాడ్, అనంతారం, అన్నారం, నారాయణగూడెం, పొట్లపహాడ్, చీదెళ్ల, అనాజిపురం తదితర గ్రామాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో వందల ఎకరాల్లో ఆయకట్టుకు నీరు అందనుందని రైతులు అంటున్నారు. కాల్వల్లోని పిచ్చిమొక్కలు, పూడిక తొలగించడంతో సాగునీరు సాఫీగా వెళ్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టు రైతులకు మేలు



ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేస్తున్న పనితో రైతులకు మేలు కలుగుతుంది. ప్రధాన కాల్వకు అనుబంధంగా ఉన్న పిల్లకాల్వల ద్వారా వందల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. దానికి నీరందించే పిల్లకాల్వల్లో పూడిక, కంపచెట్ల తొలగింపు పనులు చేయడంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. దీంతో పాటుగా కూలీలకు ఉపాధి లభిస్తుంది.

– ఐతరాజు నాగరాజు, రైతు, అనంతారం

రైతులకు మేలు చేసే పనులపై దృష్టి



ఉపాధిహామీ పథకంలో పనులను ఎక్కువగా రైతులకు మేలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం. చాలా గ్రామాల్లో ఆయకట్టుకు నీరందించే లింక్ కాల్వలతో రైతులకు కొంత ఇబ్బందిగా ఉందని తెలుసుకొని వాటి మరమ్మతు పనులపై దృష్టి సారించాం. మండలంలో ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

– రవి ఏపీఓ

ప్రజలను మోసం చేసేందుకే హామీల వర్షం



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజలను మరోసారి మోసం చేసేందుకే సీఎం కేసీఆర్ ఆచరణలో సాధ్యం కాని హామీల వర్షం కురిపిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. సూర్యాపేటలో అభివృద్ధి పేరుతో ఇసుక మాఫియా, భూ మాఫియా, మైనింగ్ మాఫియా చేసి దోచుకుంటున్నారని అన్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి అసమర్థపాలనతో ధాన్యం సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు కళ్లల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భరోసా ఇచ్చి అండగా ఉండేందుకు ఈనెల 22న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తుందని రైతులు మనోధైర్యంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆరూరి శివ, సోషల్ మీడియా పార్లమెంట్ కోకన్వీనర్ కొప్పుల క్రాంతిరెడ్డి, మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు షేక్ సలీంపాషా, జిల్లా నాయకులు దాసరి వెంకన్నయాదవ్, పంతంగి సాలయ్య, ఉపేందర్, లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయాలి

అర్వపల్లి : గొల్ల కురుమల్లో 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికి గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పథకాన్ని వర్తింపజేయాలని, నగదు బదిలీని అమలు చేయాలని కోరుతూ ఈనెల 22న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గొల్ల కురుమలు ఈ పథకంతో లబ్ధి పొందాలంటే నగదు బదిలీ పథకం ఏకైక మార్గమని అన్నారు. ఏ,బీ లిస్టులలో పేర్లు లేని వారికి సీ లిస్ట్ ప్రకటించి 18ఏళ్లు నిండిన గొల్ల కురుమలను ఈ పథకంలో భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, గురువయ్య, యాదగిరి, కృష్ణయ్య, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి



తుంగతుర్తిలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మడ్డి అంజిబాబుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుర్రం గోపాల్‌రెడ్డి, గోపిరెడ్డి, రాములు, వీరయ్య, వెంకన్న, పిచ్చయ్య పాల్గొన్నారు.

నాగారం : కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎంపీ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కడియం కుమార్ సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుడపూరి వెంకటేశ్వర్లు, మారయ్య, మహేందర్, రాములు, రాందాసు, సంతోష్, భిక్షం, సనా పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, రాజ్‌కుమార్, కడెం లింగయ్య, లింగయ్య, యాకయ్య ఉన్నారు.

అర్వపల్లి : మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శ వజ్జె శ్రీనివాస్, చెరుకు యాకలక్ష్మి, వజ్జె వినయ్, సైదయ్య, బాలయ్య, కృష్ణయ్య, ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎంపీ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, తాటి విజయమ్మ, అంతయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఇట్టమళ్ల ఎసోబ్, మండల ప్రధాన కార్యదర్శి బచ్చలకూరి రామ్‌చరణ్, సులేమాన్, కన్నయ్య, స్టాలిన్, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేత



ప్రశంసపత్రం అందజేస్తున్న ఎంపీపీ మణి

నాగారం : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్–2023 క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ కూరం మణి వెంకన్న శుక్రవారం బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ అథ్లెటిక్స్ 100మీటర్లలో ప్రథమ బహుమతి సీహెచ్ మణికంఠ, 400మీటర్లలో ప్రథమ బహుమతి సీహెచ్ శివకుమార్, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి నాగారం జట్టు, ఖోఖోలో ప్రథమ పస్తాల జట్టు, కబడ్డీలో ప్రథమ నాగారం జట్టు గెలుపొందాయి. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ శోభారాణి, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎం వెంకన్న, ఎస్ఎంపీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూర్యాపేట రూరల్ : ఎండ్లపల్లిలో వీధులను శుభ్రం చేస్తున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి



తిరుమలగిరిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో చెత్తచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శుక్రవారం పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని టేకుమట్ల, ఎండ్లపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో వీధులను శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎం లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పిండిగ పద్మ, దండి సుగుణమ్మ, కత్తుల మట్టయ్య, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా 9వ వార్డులో కాల్వలను శుభ్రపరిచి కంపచెట్ల తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చాగంటి అనసూర్య, కన్నెబోయిన రేణుక, అధికారులు మన్సూర్‌అలీ, ఎర్ర సోమయ్య, మేనేజర్ బుచ్చిబాబు, లక్ష్మణ్, ఖదీర్ పాల్గొన్నారు.

నూతనకల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధుల నివారణకు కృషి చేయాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్‌కె శర్మ, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీఓ ఉపేందర్‌రావ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని లోయపల్లిలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. డ్రెయినేజీలు, వీధులు, రోడ్లను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భద్రమ్మ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : సూర్యాపేట జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గౌడిచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతనకల్ : బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో మండల జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి శాలువా కప్పి శుక్రవారం సన్మానించారు. ఆయన వెంట పన్నాల సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



అర్వపల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



నాగారంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

అర్వపల్లి : వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చేడె అశోక్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పగిళ్ల సంధ్య, రెంటాల సందయ్య, ఆనందం, చింతల వీరయ్య, నర్సింగ విజయ్, నల్లమాద వీరేష్, సలీంపాష, కవిత, శ్రీను, నవ్య, శోభ, సుభద్ర, సౌజన్య, సరిత, పుల్లమ్మ, రాములమ్మ, ఫరీద, శివ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : వీఆర్ఏలకు పే స్కేల్ ఇవ్వాలని తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలపడంతో పట్టణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం వీఆర్ఏలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు నాగమల్లేష్, వెంకన్న, ప్రశాంత్, అనిత, గణపతి, లక్ష్మయ్య, క్రాంతి, యాదమ్మ, ఖలీల్, సత్తయ్య, రాములు, ఆగేష్ పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో మండలంలోని వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వీఆర్ఏలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు అనిత, మహేశ్వరి, రమేష్, అశోక్, పురుషోత్తం, యాదగిరి, యాదయ్య, వీరయ్య, మహంకాళి పాల్గొన్నారు.

మద్దిరాల : వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు రమేష్, అనిత, ప్రశాంత్, అశోక్, వెంకన్న, మరియమ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : వీఆర్ఏలను రెగ్యూలర్ చేసినందుకుగాను ఆ సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎండీ జహంగీర్, పిట్టల సుధాకర్, బాణాల భిక్షంరెడ్డి, రమ, సైదులు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసినందుకు వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు పటాన్ జాన్‌పాషా, యాదయ్య, మధు, వెంకటమ్మ, పద్మ, పిచ్చమ్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో..



మద్దిరాలలో..

కేసీఆర్ అవినీతిపై కేంద్రం చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం గవర్నర్ ద్వారా రిపోర్టు తీసుకొని చర్యలు తీసుకోవాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ నాయకులు రవీందర్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన సాగుతుందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదని విమర్శించారు. కేంద్రం స్పందించి రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోని కేసీఆర్ నియంతృత్వాన్ని అరికట్టాలని అన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, వై.ధీన్‌దయాళ్, ఎం.యాదగిరి, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ హన్మంతు, కె.సోమయ్య, నాగయ్య, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

అర్వపల్లి : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన చెవిటి వెంకన్నయాదవ్‌ను శుక్రవారం మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిద్ర సంపత్‌నాయుడు గుమ్మడవెల్లిలో ఆయనను కలిసి సన్మానించారు.

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన చెవిటి వెంకన్నయాదవ్‌ను మండలంలోని పోలుమల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో వెంకన్న నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్, అమృతమల్లు, లింగయ్య, రవి, వెంకన్న పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను బహిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల్‌కుమార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : విద్యార్థులను ర్యాంకుల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను బహిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతి లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కేవలం ఫీజుల దోపిడీ చేయడం లక్ష్యంగా నడుస్తున్నాయని అన్నారు. ఒకటి, రెండు ర్యాంకులను చూపిస్తూ, ఫ్లెక్సీలతో కరపత్రాలతో మైమరిపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరికాదన్నారు. విద్యార్థులను ప్రభుత్వ విద్యాసంస్థలలో చేర్పించి బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపి, నాయకులు సింహాద్రి, తరుణ్, సునీల్, విక్షిత్, అజ్రఫ్, నరేష్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు‘ను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిరాల : కంటి వెలుగు పథకాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చందుపట్లలో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాణి, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ, వైద్యాధికారిణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాటర్ ఫిల్టర్ బహూకరణ

అర్వపల్లి : మండల కేంద్రానికి చెందిన వ్యాపారి దివంగత శర్విరాల నర్సయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి శశిరేఖ, కుమారుడు శర్విరాల సంతోష్–గౌతిమి దంపతులు శుక్రవారం స్థానిక శ్రీయోగి షిరిడీ సాయిబాబా మందిరానికి రూ.10వేల విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్/కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ కుంట రమేష్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ప్రతి గ్రూప్‌లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వినియోగించని వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటర్‌కు ఇవ్వాలి

సూర్యాపేట : పట్టణంలోని పొడి చెత్త (నోట్ పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత చెప్పులు, యూజ్డ్ క్లాత్ (పాత బట్టలు), బాటిల్స్, కాగితాలను, రేకులు ఇతర వస్తువులను తమ తమ ఇళ్లలో భద్రపరిచాలని రామానుజులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మీ వార్డులోని ప్రధాన సెంటర్లలో శనివారం నుంచి వారానికి ఒక రోజు నిర్వహించే ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రియూజ్ రీసైకిల్) సెంటర్లకు అందించి కిలో ఒక్కంటికి రూ.5లు నగదు పొందాలని సూచించారు.

ఎన్టీఆర్‌ను శ్రీకృష్ణుడి రూపంగా చూపడం హేయమైన చర్య

భానుపురి (సూర్యాపేట) : ఖమ్మం పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని శ్రీకృష్ణుడి ప్రతిరూపంగా ఏర్పాటు చేసి చూపడం హేయమైన చర్యఅని యాదవ్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం పట్టణంలోని లక్కారం ట్యాంక్‌బండ్‌పై కొందరు శ్రీకృష్ణ భగవాన్ రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని జిల్లా యాదవ ట్రస్టు సభ్యులందరూ పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో తోట శ్రీనివాస్, రాజు, బుడగ మల్లేష్, సింహాద్రి, వీరస్వామి ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

పెన్‌పహాడ్ : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని నాగులపాటి అన్నారంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దనియాకుల శ్రీనివాస్‌కు చెందిన గడ్డివాము 600కట్టలు దగ్ధమయ్యాయి. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పారు. సుమారు రూ.60వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

తరుగు పేరుతో మోసం చేస్తున్న మిల్లర్లు

తుంగతుర్తి : ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయా కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మిల్లర్లు ఒక లారీకి 6నుంచి 8క్వింటాల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తూకాల్లో జరుగుతున్న మోసాలను గుర్తించి రైతులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు నాయకులు గాజుల మహేందర్, నాగరాజు, రైతులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మన్నూరి వెంకన్న విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన స్నేహితులు రూ.47వేల నగదును మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బాల్య స్నేహితులు పన్నాల మల్లారెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, సురేందర్, గోపాల్, లింగయ్య, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలి

మద్దిరాల : మండల కేంద్రంలో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చందుపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ ఉన్నారు.